

# అనగనగా ఓ మంచి కథ

## బాబాయి - గొల్లపూడి మారుతి రావు

బిలాస్‌పూర్ బదిలీ అనగానే ఒకే నిర్ణయానికి వచ్చాను - ఉద్యోగానికి రాజీనామా చేద్దామని. మిత్రులందరికి ఉత్తరాలు రాసేశాను. తెలుగుదేశంలో ఎక్కడయినా చిన్న నౌఖరీ కుదిర్చి పెట్టమని. నా ఉద్దేశం ముందునుంచీ మా ఆవిడకు తెలుసు. వెళ్ళితీరాలని పట్టుబట్టి కూర్చుంది. లేకపోతే తను పుట్టింటికి పోతానని బెదిరించింది. పెళ్ళానికి విడాకులివ్వడంకన్నా పాత ఉద్యోగం చేసుకోవడమే మంచిదనిపించి సిద్ధపడ్డాను - ఆఖరికి.

ఏదో కొత్త పదవి నాకు లభించినంత ఆనందంగా ప్రయాణానికి సిద్ధపడింది మా ఆవిడ. సామాన్లన్నీ తనే సర్దేసింది. రైల్లో ఆమె హడావిడి చూస్తే నేను కష్టపడినా మరొక ప్రాణిని సంతోషపెట్టానని ఆనందించాను. బిలాస్‌పూర్ రైలు చేరేసరికి కుండపోతగా వర్షం. రుబ్బురోలు దగ్గర్నుంచి, టేబులు ఫాను వరకు అన్నీ చేత్తో పట్టుకుని వర్షంలో దిగాం. ఒక్క మొహం తెలిసినది లేదు, భాషరాదు. ఊరుకొత్త. జీవితంలో తెలుగుదేశం వదిలిరావడం అదే మొదటిసారి. హోటల్ అని మాత్రం చెప్పి రిక్షా ఎక్కాం. ఆ వర్షంలో చీకటి రాత్రిలో ఊరులోంచి వెళుతుంటే జివ్వుమంటున్న కీచురాళ్ళ కప్పల బెకబెకల మధ్య మా ఆవిడ ఆనందం కాస్త సడలింది. హోటల్ గదిలో దోమలు మిగతా ఆనందాన్ని పీల్చేశాయి. అంతే - తెల్లవారు ఝామున మూడుగంటలకి హోటలు మంచం మీద లేచి కూర్చుని భోరుమంది. కొత్త దేశం వచ్చిన చికాకుని దిగమింగి ఓదార్చడం నా వంతయింది.

అలా మా ప్రవాసం ప్రారంభమయింది. మర్నాటి నుంచీ నేను ఇళ్ళవేటకి బయలుదేరాను. ఆఫీసులో ఒకటి రెండు తెలుగు ముఖాలు కనిపించాయి. వాకబు చెయ్యగా - ఓ చిన్న తెలుగు సంఘం ఉందనీ, తెలుగు మనుషులు చాలామందే ఉన్నారని తెలిసింది. మరి పదిరోజులకి ఓ చిన్న ఇల్లు అమిరింది.

మర్నాటినుంచీ బొగ్గుల దుకాణం దగ్గర్నుంచి, పాలఖాతా, పనిమనిషి వగైరాలన్నిటికీ వెదుకులాట ప్రారంభమయింది. తెల్లవారి లేస్తే ఆఫీసుకి పోవాలి. మా ఆఫీసులో తోటి గుమాస్తా తిరుమూర్తి పలకరించాడు. "ఏం బ్రదర్ పూర్తిగా సెటిలయినట్టేనా?" అని. కష్టాలన్నీ ఏకరువు పెట్టాను.

"అబ్బే! అవేం పెద్ద సమస్యలు కావు. మనవాళ్ళందరి కష్టాలు తీర్చే ఓ మనిషి ఇక్కడున్నాడు. రేపు పొద్దున బాబాయిని ఇంటికి పంపిస్తాను. నువ్వేం గాభరాపడకు" అన్నాడు.

"మీ బాబాయా?" అన్నాను.

"అదా! అతను బంధువూ కాదు సింగినాదం కాదు. ఈ ఊరంతటికీ అతనే బాబాయి. కరివేపాకులాంటివాడు" అన్నాడు.

ఏమయినా మా ఆవిడ కష్టాలు రేపటినుంచీ తీరుతున్నాయన్న శుభవార్త పట్టుకుని ఆనందంగా ఇల్లు చేరాను- నడవలో కొయ్య స్థంభానికి చేరబడి మా ఆవిడ ఎవరితోనో మాట్లాడుతోంది. ఎదురుగ్గా గంగాళం బోర్లించి దానిమీద తాపీగా కూర్చుని ఓ మనిషి కబుర్లు చెపుతూ నింపాదిగా కాఫీ చప్పరిస్తున్నాడు.

నన్ను చూడగానే ఆనందంగా ఆవిడే పలకరించింది. "రండి రండి - పొద్దున కిరసనాయిలు కోసం వీధి చివర దుకాణం దగ్గరికి వెళితే కమలమ్మగారు కనిపించారు. మన సంగతంతా చెపితే సహాయం చెయ్యడానికి బాబాయిగారిని పంపారు" అంది ఆయన్ని చూపిస్తూ.

బాబాయి మనస్ఫూర్తిగా చిరునవ్వు నవ్వుతూ - "నమస్కారం బాబాయ్! మీ గురించి నాకేం చెప్పక్కరలేదు. మీ పేరు ముకుందరావు. డబ్లింగ్ లో డి2. కొత్తగా బదిలీ అయి వచ్చారు. అమ్మాయి సగం చెప్పింది. ఇంట్లో తమలపాకులున్నాయా?" అన్నాడు ఎంతో చొరవగా.

"అయ్యో లేవండీ" అంది మా ఆవిడ చిన్నబుచ్చుకుంటూ.

"మరేం ఫరవాలేదు. రేపు అపూర్‌చంద్‌గాడికి చెపుతాను. రెండురోజులకోసారి పావలా కట్ట ఇంట్లో పారేస్తాడు. ముందు డబ్బివ్వకండి. నెలకోసారి ఇచ్చేట్లు మాట్లాడి పెడతాను. బాబాయి నిలబడే ఉండిపోయారు. మొదట కాఫీ ఇయ్యి" అన్నాడు, నేనే ఆ ఇంటికి కొత్తగా వచ్చినట్టు.

బాబాయిని తేరిపార చూశాను. ముందు రెండు పళ్ళు ఊడిపోయాయి. కళ్ళద్దాలు, గారపట్టిన పళ్ళు, వయస్సు యాభై దాటదు. జుత్తు బాగా నెరిసింది. డొక్కలోనికి పోయి చిన్న గూనిలాగ నడుం వంచి కూర్చున్నాడు. పిర్రలు పట్టేసిన పాంటు, ఖద్దరు షర్ట్ పాంటులో దోపాడు. చేతిలో కోతిమార్కు పళ్ళపొడి అని వెలిసిపోయిన అక్షరాలున్న తెలుగు సంచి - దాంట్లోంచి బయటికి తొంగి చూస్తున్న మునక్కాడలు- ఇదీ అవతారం.

నేను గుక్క తిప్పుకునే లోగానే - "ఇంటికి అద్దెంత?" అన్నాడు వాసాలు లెక్కబెడుతూ.

"నూట ఇరవైరూపాయలే - అయ్యోవీడి మొహం ఈడ్చ - ఈ బిహారీలాల్ గాడికి యావ పెరిగిపోతోంది. అడ్వాన్స్ ఇచ్చారా?"

"రేపివ్వాలి"

"అయితే నే చెప్పేదాకా ఇవ్వకండి. రెంటు కంట్రోలు వాడికి అప్పగిస్తానని బెదరగొడతాను గాడిద కొడుకుని" అన్నాడు.

నేనింకా గుమ్మంలోకి కుర్చీ లాక్కుని కూర్చునే లోపునే లేచి వంటిల్లంతా చుట్టబెట్టేశాడు. "ఏమిటమ్మా? సామాన్లన్నీ గదినిండా ఇలా పేర్చేసుకున్నావు? ఈ ఊరి వాళ్ళకి మనవేపులాగ ఇమ్ముగా గదులు కట్టుకోవడం తెలిసి చావదు! సబ్జీ బజారు దగ్గర సెకండుహాండు అలమారాలు అమ్ముతారు. సైకిలు మీద రేపు సాయంకాలం ఇటువచ్చినప్పుడు రెండు పడేసి పోతాను. ఇక్కడ పాలకే కాస్త ఇబ్బంది. కార్డు సంపాదించాలి - బాబాయిని ఆఫీసులో కలుసుకుని ఆ సంగతంతా చూస్తాలే" అన్నాడు.

మా ఆవిడలో మళ్ళీ విజయవాడలో ఉత్సాహం పుంజుకొచ్చింది. "దేవుడులాగ మీరు కనిపించారు బాబాయిగారూ! నాకిప్పుడు ధైర్యం వచ్చింది. ఇక్కడెలా బతకడమా అని పది రోజులయి గిలగిలలాడిపోతున్నాను."

"అయ్యో! నేనుండగా మీకే కొరతారాదు. కష్టం వస్తే, కాకిచేత కబురు పంపించండి. హిందీ కాకులకైనా బాబాయి పేరు అర్థమయిపోతుంది" అని అని పిడుగుపడినట్టు నవ్వాడు.

ఏదో సినిమా చూస్తున్నట్టు అతన్ని నివ్వెరపాటుతో చూస్తూ కూర్చున్నాను. మరో అయిదు నిమిషాలకి వాకిట్లోకి వచ్చి నా సైకిలు చూశాడు. "ఏమిటి బాబాయ్! హెర్క్యులస్ లాగుంది. సీటు చెడిపోయింది. మరి రెండు నెలలు లాగేస్తుందిలెండి. 48లో డ్రైవరుకి చెపితే

ఝూర్పుగూడనుంచి మంచి సీటు లాక్కొచ్చేస్తాడు. రెపేర్లకి మాత్రం మిలాస్ హోటలుపక్కన హకీం సాయిబుకివ్వండి. నా పేరు చెపితే కొత్త సైకిలు ఇచ్చేయమన్నా ఇచ్చేస్తాడు" అన్నాడు.

"మరి వస్తాను" అని సంచి తీసుకులేచి "ఇక్కడ యూకో బ్యాంకులో త్రివిక్రమరావు అని - మనవాడే - తెనాలి. వాళ్ళ అమ్మకి ఉబ్బసం. మంచి యునాని మందుందని చెప్పారు. ఎదురు చూస్తూ ఉంటాడు - వస్తాను. రేపు ఆఫీసులో కలుస్తాను. మీ వివరాలన్నీ కాగితం మీద రాసి ఉంచండి. డైరీ ఫారంకి వెళ్ళి దాఖలు చేస్తాను" అన్నాడు.

అప్పుడు చూశాను గోడకు వాల్చి ఉన్న సైకిలుని, సీటు ఉండాల్సిన చోట న్యూస్ పేపర్లు చుట్టి దానికి గావంచ ఒకటి చుట్టాడు. నా సీటు ఝూర్పు గూడ నుంచి రావాలిగాని, అతని సీటు ఇంట్లోనే తయారయినట్టుంది. ఝూర్పు కూడా సైకిలెక్కేశాడు.

మా ఆవిడకి ప్రమోషన్ వచ్చినప్పటికంటే పరమానందంగా ఉంది. "ఈ ఊళ్ళో దేవుడిలాంటి మనిషి దొరికాడు. ఎంత కలుపుగోరు మనిషి. ఎంత మంచివాడు!" అని మురిసిపోయింది.

తిరుమూర్తిని అడిగాను - అసలు ఈ బాబాయి ఎవరని?

"ఏం? కలిశాడా, అయితే నీ కష్టాలన్నీ తీరినట్లే" అన్నాడు. "అతను అందరికీ బాబాయి. అసలు పేరు రంగనాయకులు. నేనీ ఊరొచ్చిన సంవత్సరానికి తెలిసింది. ఊరు ఏలూరు. ఇక్కడికొచ్చే వాళ్ళంతా బదిలీల మీద వచ్చి పోయేవాళ్ళే. కనుక రంగనాయకులు ఈ ఊరెప్పుడొచ్చాడో ఎవరికీ తెలీదు.. హిందీ, బెంగాలీ, ఒరియా అనర్గళంగా మాట్లాడుతాడు. అసలు నన్నడిగితే ఆంధ్రప్రదేశ్ గవర్నమెంటు ప్రవాసాంధ్రులు సంక్షేమానికి ఊరూరా ఇలాంటి పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్స్‌ని ఉంచాలంటాను" అన్నాడు.

నేను నవ్వుకున్నాను.

మర్నాడు అతను చెప్పినట్టే సరిగ్గా మూడుగంటలకు ఆఫీసుకి వచ్చేశాడు బాబాయి. అతణ్ణి చూడగానే తెలుగు ఉద్యోగులంతా అతన్ని చుట్టుముట్టేశారు. ఆఫీసు వరండాలో ఒక స్టూలు లాక్కుని కూర్చున్నాడు బాబాయి. దుకాణాల్లో ఇచ్చే రశీదులన్నీ ఒక పుస్తకంగా కుట్టాడు. దాన్ని సంచిలోంచి తీసి పెన్ను పట్టుకు కూర్చున్నాడు. అతన్ని చూడగానే అందరికీ తలో పనీ గుర్తుకొచ్చినట్టుందిగావును.

"బాబాయ్! అబ్బాయి స్కూలుకి తీసుకెళ్ళే కాన్వాసు సంచి కావాలంటున్నాడు"

"మా ఆవిడ నక్క దోసకాయలు తీసుకు రమ్మంటోంది బాబాయ్"

"మాదీఫలం రసాయనం చిన్న సీసా తీసుకురమ్మని చెప్పమన్నాడు మామయ్య" ఇలా వరసగా పనులు అప్పగించారు.

వరాలిచ్చే దేవుడిలాగ ఏమాత్రం అభ్యంతరం చెప్పకుండా చిరునవ్వుతో రాసుకుపోతున్నాడు.

తిరుమూర్తి ముఖం చేటంతయింది. "థాంక్స్ బాబాయి! నా కాపురాన్ని నిలబెట్టావు" అన్నాడు.

కేవలం వాళ్ళు కోరే పనులే కావు. వాళ్ళ అవసరాల్ని, ఇష్టాల్ని కనిపెట్టి పనులు తనమీద వేసుకుంటాడు బాబాయ్.

నా వివరాలన్నీ కాగితం మీద రాసిచ్చాను. "సాయంకాలం మన షాపు దగ్గరికి వచ్చేసెయ్ బాబాయ్. పాలకార్డు రెడీగా ఉంటుంది" అని లేచాడు బాబాయ్.

"షాపా! అదెక్కడ?" అన్నాను.

మా వాళ్ళంతా నవ్వేశారు. "బాబాయ్ షాపెక్కడని బాబాయిని కాదయ్యా, రోడ్డు మీద నిలబడి గట్టిగా అను. నీ పక్కనున్న మనిషే దారి చూపిస్తాడు" అన్నారు.

నా భుజం తట్టి "మరేం గాభరా పడకు బాబాయ్. మన పరపతి ఈ ఊరి శ్మశానందాకే. కూరల మార్కెట్టు దగ్గరికి వచ్చి సైకిళ్ళన్నీ ఎటువేపు పెట్టున్నాయో గమనించు. అవన్నీ నా దుకాణానికే వస్తాయి" అన్నాడు.

నేనాశ్చర్యపోయాను. సైకిలు దుకాణం నడిపే మనిషికి కాస్తయినా సంపాదన ఉండాలి. బాబాయి చూస్తే కనీసం సైకిలు షాపులో మెకానిక్ లాగయినా కనిపించడంలేదు.. సాయంకాలం సైకిలు షాపుకి వెళ్ళినపుడు అసలు విషయం అర్ధమయింది. ఒక సందు మలుపులో మిగిలిపోయిన - ఎవరికీ పనికిరాని జాగాలో అతని సైకిలు షాపు వెలిసింది. అతనికింద పన్నెండేళ్ళ కుర్రాడు అసిస్టెంటు. చిన్న దుకాణం. ఆదాయం పెద్ద ఉన్నట్టు లేదుగానీ అందరికీ ఆ షాపుతో అవసరం ఉన్నట్టు కనిపించింది. ఆ బజారు కొచ్చే ప్రతీ సైకిలూ అక్కడే ఆగుతోంది. "ఏమయినా అద్దె వసూలు చేస్తారా?" అన్నాను - అక్కడ బల్లమీద కూర్చుని.

నవ్వి "అదా! వాళ్ళిక్కడికి వచ్చిపోవడమే అద్దె - ఇక్కడ నా పని నేను చూసుకుంటాను - వాళ్ళ సైకిళ్ళు ఇక్కడ పడేసి పోతారు. ఈ మాత్రం సాయానికి డబ్బు కట్టాలా?" అన్నాడు. అక్కడికొచ్చే వాళ్ళకి ఉపకారంకోసం బాబాయి ఆ సౌకర్యం చేశాడు. వాళ్ళు అది అవకాశం చేసుకుంటున్నారు. అంతే. బాబాయి అంటే తెలియని వాళ్ళు కూడా ఆయన్ని పలకరించకుండానే అదేదో తమ హక్కులాగ అక్కడ సైకిళ్ళు ఆపుకుని వెళ్ళడం గమనించాను.

ఆమాటే అడిగాను. "తెలిసిన వాళ్ళకి సహాయం చేస్తే అర్ధముంది. తెలియని వాళ్ళకి ఎందుకు?" అన్నాను.

బాబాయి స్థితప్రజ్ఞుడిలాగ చిరునవ్వు నవ్వి "తెలుసుకోడానికి కాస్త టైం పడుతుంది" అన్నాడు. నా పాలకార్డు తీసి ఇస్తూ "ఇదిగో కార్డు. ఉదయం అరలీటరు, సాయంత్రం అరలీటరు - అమ్మాయికి ఎక్కువ ఇబ్బంది ఉండదు. మన ఇంటిపక్కనే బూత్. పాలు తెచ్చుకోవడం కష్టమయితే నాకు చెప్పు, ఈ భోలాగాడిని పంపిస్తాను. వెధవకి మాటలు రావు. కాని చాకు" అన్నాడు. అప్పుడు ఆ కుర్రాడిని చూశాను. వాడు మూగ అని అప్పటికి అర్ధమయింది. "మనకి ఈ షాపుకి రావడానికే వ్యవధి చాలదు! వీడే షాపు నడిపిస్తాడు. అప్పుడప్పుడు వచ్చి వీడిమీద కర్రపెత్తనం చేస్తుంటాను. మంచి 'మలాయ్ చాయ్' తాగుతావా బాబాయ్?" అన్నాడు. ప్రశ్నకు సమాధానం చెప్పేవరకు ఆగలేదు. భోలానిపిలిచి "చాయ్" పురమాయించాడు.

"మీరుండేదెక్కడ?" అన్నాను.

నవ్వాడు. "ఎక్కడేమిటి బాబాయ్? ఎవరెప్పుడు నన్ను తలుచుకుంటే అక్కడ. ఇరవైరోజుల్నుంచీ మైలేజ్ క్లర్క్ విఠల్‌రావుగారి బావమరిది ఆస్పత్రిలో ఉన్నాడు. కాన్సర్. అక్కడున్నాను - నాలుగురోజుల క్రిందటే ఆయన నన్ను రిలీజ్ చేశాడు".

"బాగుపడ్డాడా?"

"అబ్బే చచ్చిపోయాడు"

"అంతకు క్రితం?"

"గోపీనాథంగారని - ఇక్కడ మోటారు కంపెనీలో గుమస్తా. ఆయనకి అనుకోకుండా పాట్నా బదిలీ అయిపోయింది. పెళ్ళాం రోగిష్టి మనిషి - నలుగురు పిల్లలు. పనులన్నీ పూర్తి చేసుకుని అక్కడకి పోయి పడుకునేవాడిని. ఎక్కడా ఏ పని లేనప్పుడు ఇదిగో - ఈ బల్ల నా నివాసం."

అతని జీవితం వింతగా తోచింది నాకు.

"మరి మీ భార్యా పిల్లలూ?"

ఫక్కున నవ్వాడు.

"మనకి తీరుబాటు ఉండదని పిల్లల్నివ్వడం మానేశాడు దేవుడు. భార్యనా? తీసుకొస్తాను. కాస్త మనం ఇక్కడ బాగా నిలదొక్కుకుని నాలుగు పైసలు సంపాదించుకున్నాక - చాలా దూరంలో ఉంది" అన్నాడు.

నాకెందుకనో బాబాయ్ మంచితనం కేవలం స్వభావంలాగ కనిపించలేదు. అదొక ఉద్యమంలాగ కనిపించింది. ఏదో పెద్దపోరాటాన్ని నిష్ఠతో సాగిస్తున్న వీరుడిలాగ కనిపించాడాయన.

నేను బిలాస్‌పూర్‌లో ఉన్న నాలుగేళ్ళు నాకు తలలో నాలికలాగ ఉన్నాడు. మా ఆవిడకయితే అతను సొంత తల్లిదండ్రులకన్నా ఎక్కువయిపోయాడు. మళ్ళీ బదిలీ అయే రోజులు దగ్గరకొస్తున్నాయంటే బాబాయినెలా వదిలిపోవాలా అన్న బెంగ పట్టుకుంది. అతని మంచితనం ఆ ఊరి ప్రజాజీవితంలో "వైరస్" లాంటిది. దాన్నెవరూ తప్పించుకోలేరు. జీవితంలో ప్రతిచోటా అలాంటి వ్యక్తులు దొరకరు. బదిలీ ఆలోచన వస్తేనే గుండె గొంతులో కదిలేది.

కాని ఆ సమస్యని సులువుగానే పరిష్కారం చేశాడు బాబాయి. ఒక వేసవికాలం సాయంత్రం గోపీనాధంగారి పిల్లలకి గాలిపటాలు కొని తెచ్చి రెండో అంతస్తు మీదకి వెళ్ళి వాళ్ళతోపాటు ఎగరేస్తున్నాడు. రెండో అంతస్తు అప్పుడే కొత్తగా కడుతున్నారు. పిల్లలు గాలిపటాలు చూస్తూ గెంతుతున్నారు. ఎగరేస్తూ ఎగరేసూ పిట్టగోడ చివరికి నడిచి మేడమీంచి పడిపోయాడు. నడుం విరిగిపోయింది.

బాబాయిని ఆస్పత్రిలో చేర్చారని తెలిసి దిగ్భ్రాంతుడినయ్యాను. వెంటనే ఆస్పత్రికి పరిగెత్తాను. మా ఆవిడయితే ఆ విషయం వినగానే భోరుమంది. మంచం మీద నిశ్చలంగా తపస్సుకి సిద్ధపడుతున్న రుషిలాగ పడుకున్నాడు. మెడ కదలకూడదు. ఒంటిచుట్టూ పెద్ద ప్లాస్టరు. నన్ను చూసి చిరునవ్వు నవ్వాడు. "రా బాబాయి. నీకోసమే ఎదురు చూస్తున్నా" అన్నాడు బలహీనంగా.

అతన్ని చూస్తే కళ్ళనీళ్ళు వచ్చాయి నాకు. "ఏమన్నారు డాక్టర్లు?" అన్నాను మంచం పక్కన కూర్చుంటూ.

"మరేం ఫరవాలేదన్నారు. ఇంకా ఎన్ని రోజులు బతుకుతానో చెప్పడానికి మొహమాటపడుతున్నారు" అన్నాడు నవ్వుతూ.

"ఛఛ! మీలాంటి మంచివాళ్ళు పదికాలాలపాటు బతకాలి, తప్పక నయమవుతుంది" అన్నాను.

"నా బాధ అదికాదు. ఇంకా ఎక్కువమందికి శ్రమ ఇవ్వకుండా త్వరగా పోవాలని" అన్నాడు ఎటో చూస్తూ.

హఠాత్తుగా - అతని భార్య గుర్తుకు వచ్చింది. "అన్నట్టు కనీసం ఈ సమయంలోనయినా మీ భార్య రావడం మంచిది కదా చేదోడుగా ఉంటుంది. అడ్రసు ఇవ్వండి. టెలిగ్రాం ఇస్తాను. రెండురోజుల్లో వచ్చేస్తారు" అన్నాను.

"వస్తుంది. కాని రావడానికి చాలాదూరం. టెలిగ్రాం అందుతుందో లేదో" అన్నాడు.

"అదేం?"

నా వేపు తిరిగి "నా రహస్యం ఎప్పుడో ఒకప్పుడు ఎవరికో ఒకరికి చెపాలి. మా ఆవిడ చచ్చిపోయింది. చచ్చిపోయి ఇరవై ఏళ్ళయింది" అన్నాడు.

నేను దిమ్మరపోయాను - "అయితే మరింతకాలం -"

"ఇంకొకరి జాలితో బతకకూడదనుకున్నాను. నా కష్టం నాకే ప్రత్యేకం. ధైర్యంగా, రహస్యంగా అనుభవించాను" అన్నాడు.

ఈలోగా ఇద్దరు లోపలికి వచ్చారు. వాళ్ళని నేనెప్పుడూ చూడలేదు. ఇద్దరూ ఉత్తర హిందూదేశం మనుషులే. ఒకాయనకి బాబాయిని చూడగానే కళ్ళనీళ్ళు తిరగడం గమనించాను. పక్కన కూర్చుని ఎంతోసేపు మాట్లాడారు. చిరునవ్వుతో వాళ్ళ ప్రశ్నలకి సమాధానాలిస్తూ వాళ్ళ పనులేవో ఎలా చెయ్యాలో చెపుతున్నాడు.

"ఈయన మోటారు సైకిలు టైరు మన షాపులో ఉండిపోయింది బాబాయ్ రేపు దయచేసి ఆయనకి అందచెయ్యి" అన్నాడు నా వేపు తిరిగి.

మంచం మీద పడుకుని కూడా తన బాధ గురించికాక అతని మోటారు సైకిలు టైరు గురించి ఆలోచించే అతన్ని చూసి గుండె ద్రవించిపోయింది.

వెళుతూ వాళ్ళిద్దరిలో ఒకాయన ఆపిలుపండు తీసి రెండు చేతుల్లో వినయంగా బాబాయి చేతిలో పెట్టాడు. ఇద్దరూ పేదవాళ్ళలాగే ఉన్నారు. పండు అక్కడక్కడా కుళ్ళు చూపింది. కాని ఆ పండు చూసుకుని పొంగిపోయాడు బాబాయి. వాళ్ళు వెళ్ళిన తర్వాత కూడా నేను చూస్తూ కూర్చున్నాను.

ఎంతోసేపటికి నా వేపు తిరిగి - "కృతజ్ఞత ఎంత విలువయినది బాబాయ్" అన్నాడు. "ఇందాక మా ఆవిడ గురించి అడిగావు కదూ? - మా లలిత, ఇరవై ఏళ్ళ కిందట ఈ ఊళ్ళోనే పోయింది. నేనీ ఊరొచ్చిన కొత్త. ఇక్కడెవరూ నాకు తెలీదు. భాష తెలీదు - తెలుగు వాళ్ళు ఉన్నా ఒకరికొకరికి పొందికలేదు. పలకరించే నాథుడు లేదు. మా ఆవిడకి నెలలు నిండి మశూచి పోసింది. ***పేదరికం భయంకరమనుకుంటాం కాని సానుభూతి, సహాయం దొరక్కపోవడమంత భయంకరమయిన బాధ మరొకటి లేదు. పేదవాడిని రోజూ ఓదార్చగలిగితే ఆకలిని కూడా మరిపించవచ్చునని నా నమ్మకం.*** ఒక్కమాటలో చెప్పాలంటే ఈ ఊళ్ళో నా అనేవాళ్ళు లేక - మా ఆవిడ నా చేతుల్లో చచ్చిపోయింది. శవాన్ని తగలెట్టడానికి మనుషుల్ని బతిమాలుకున్నాను"

ఆగి మంచినీళ్ళుకావాలన్నాడు. ఇచ్చాను.

"నేను నష్టపోయిందేమిటో నాకు తెలుసు. సానుభూతి. పక్కవాడి గురించి ఆలోచించని సమాజం మీద తిరగబడాలనుకున్నాను ఇరవై ఏళ్ళు ఆ పనిచేశాను. సహాయం కావాలనుకున్నవాడికల్లా సహాయం చేశాను. ఫలితం ఇవాళ మంచమెక్కితే పక్కన కూర్చునే ఒక మిత్రుడిని, సానుభూతితో చేతికి అందిన ఈ ఆపిలు పండునీ సంపాదించుకున్నాను. ముగ్గురు వ్యక్తుల దృక్పథంలో మార్పుకి ఇరవై ఏళ్ళు శ్రమపడాల్సి వచ్చింది. ఓహ్! ఈ ఆపిల్ పండు ఎంత విలువయినదో తెలుసా బాబాయ్! నేను దీనికోసమే ఇన్నాళ్ళూ బతికాను"

మరి రెండు రోజుల తరవాత బాబాయి చచ్చిపోయాడు.

( )